# బంగారం గనుల అన్వేషణ లైసెన్స్ దక్కించుకున్న సింగరేణి

- కీలక ఖనిజాల అన్వేషణలో సింగరేణి
- వేలంలో కర్ణాటక దేవదుర్గ్‌లోని బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ దక్కించుకున్న సింగరేణి
- సింగరేణి చరిత్రలో తొలిసారిగా కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశం
- భవిష్యత్‌లో మైనింగ్ చేసే సమయంలో 37.75 శాతం రాయల్టీ పొందనున్న సంస్థ
- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు



**కొత్తగూడెం ఆగస్టు 19 నవభూమి ప్రతినిధి:** సింగరేణి సంస్థ కీలక ఖనిజరంగంలోకి ప్రవేశించాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం కార్యరూపం దాల్చింది. కర్ణాటకలోని దేవ దుర్గ్ లోని బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ కోసం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్లైన్ వేలంలో 37.75 శాతం రాయల్టీ ని కోట్ చేయడం ద్వారా సింగరేణి ఎల్-1 బిడ్డర్గా నిలిచినట్లు సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ మంగళవారం తెలిపారు. తద్వారా కీలక ఖనిజాన్వేషణలో సింగరేణి శుభారంభం చేసినట్లు అయిందన్నారు. సింగరేణిని ఇతర రంగాల్లోకి విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చేస్తున్న ప్రయత్నంలో తొలి విజయాన్ని సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో ఈ గనుల్లో అన్వేషణను పూర్తి చేస్తామన్నారు.

**త్వరలోనే కర్ణాటకలో సింగరేణి అన్వేషణ....**


కర్ణాటక దేవదుర్గ్ లోని బంగారం, రాగి నిక్షేపాలు ఉన్న ఈ ప్రాంతంలో సింగరేణి అన్వేషణ విభాగం ఆధ్వర్యంలో త్వరలో పరిశోధన చేయనుంది. వివిధ రకాల అన్వేషణల అనంతరం తుది ఫలితాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం కేంద్రం ఈ గనులను మైనింగ్ కోసం వేలంలో వేస్తుంది. ఆ గనులను సింగరేణి లేదా ఇతర సంస్థలు దక్కించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ గనులను మైనింగ్ కోసం దక్కించుకున్న సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలో 37.75 శాతాన్ని ఆ గని జీవిత కాలం పాటు సింగరేణికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ అన్వేషణ కోసం సుమారు 90 కోట్ల రూపాయలు వ్యయం అవుతుండగా.. అందులో రూ.20 కోట్లను కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ గా చెల్లిస్తుంది.

**ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి అభినందనలు**

బొగ్గు మైనింగ్ లో 136 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి సంస్థ తొలిసారిగా బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ను వేలం ద్వారా దక్కించుకోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ హర్షం ప్రకటించారు. సింగరేణి సంస్థ తనకున్న అపారమైన అన్వేషణ అనుభవం, బొగ్గు తవ్వకం అనుభవంతో కీలక ఖనిజాల అన్వేషణలోనూ దేశంలో ఒక అగ్రగామి సంస్థగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో సింగరేణి అంతర్జాతీయ సంస్థగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సంస్థ సీఎండీ బలరామ్కు, ఉద్యోగులందరికీ అభినందనలు తెలియజేశారు.

**మూడు గనుల వేలంలో పాల్గొన్న సింగరేణి...**

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 13వ తేదీన మొత్తం 13 కీలక ఖనిజాల అన్వేషణ లైసెన్స్ ల కోసం వేలం ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో సింగరేణి సంస్థ పాలుపంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో అన్వేషణకు అనువైన బ్లాక్లపై సింగరేణి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసి అధ్యయనం చేయడం జరిగింది. అనంతరం మధ్య ప్రదేశ్ లోని పదార్ లోని ప్లాటినమ్ గ్రూప్ ఎలిమెంట్స్ బ్లాక్, ఆంధ్రప్రదేశ్ లోని చంద్రగిరి వద్ద ఉన్న ఒంటిల్లులోని రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ బ్లాక్, కర్ణాటకలోని బంగారం, రాగి బ్లాక్లు తమకు అనువైనవని గుర్తించడం జరిగింది. వీటి కోసం ఈ నెల 13, 14, 19 తేదీల్లో కేంద్ర ప్రభుత్వం ఆన్లైన్ వేలం నిర్వహించింది. ఇందులో ఈ నెల 19వ తేదీన జరిగిన వేలంలో కర్ణాటకలోని దేవదుర్గ్లోని బంగారం, రాగి బ్లాక్ల అన్వేషణ లైసెన్స్ను సింగరేణి దక్కించుకోవడం విశేషం.

నవభూమి
జిల్లా అనుబంధం
20 ఆగస్టు,2025 బుధవారం పేజీలు:6
www.epaper.navabhoomi.in


# న్యూసెన్స్ చేస్తే సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు

- చోరీ కేసులు ఛేదించేందుకు ప్రతేక పోలీస్ బృందాలు
- గంజాయి సరఫరా, వినియోగాన్ని సమూలంగా నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు
- రెండు నెలల్లో 114 గంజాయి బ్యాచ్ అరెస్టు
- రూ.11 లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం
- టౌన్ ఏసీపీ రమణమూర్తి



**ఖమ్మం క్రైం, నవభూమి, ఆగస్టు 19 :** బహిరంగ మద్యపానం, రాష్ డ్రైవింగ్, రాత్రి సమయాల్లో సమయానికి మించిషాపులుతెరవడం, పని లేకున్నా రోడ్లపై రావడం, పుట్టినరోజు వేడుకలు రోడ్డుపై వాహనాలు అడ్డం పెట్టి పబ్లిక్ న్యూసెన్స్ చేస్తే సిటీ పోలీసు యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. చోరీ కేసులను చేదించేందుకు మూడు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేసినట్లు టౌన్ ఏసీపీరమణమూర్తి తెలిపారు. చోరీ సంఘటనా స్థలంలో లభించిన ఆధారాల మేరకు త్వరితగతిన కేసు ఛేదించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాంతాలలో రికార్డు అయిన సిసి కెమెరాల పుటేజ్ ఆధారంగా అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. గంజాయి సరఫరా, వినియోగన్ని సమూలంగా నియంత్రించేందుకు నగరంతో పాటు శివారులో ప్రాంతాలలో డివిజన్ పోలీసుతో పాటు టాస్క్ ఫోర్స్, సిసిఎస్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని, ఈ ప్రయత్నాలలో భాగంగా ఈ ఏడాది జులై, ఆగస్టు నెలలోనే ఖమ్మం డివిజన్ లో 38 కేసులు నమోదు చేసి 167 మంది గంజాయి బ్యాచ్ లను గుర్తించి, 114 మందిని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. వారి నుండి 11 లక్షల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

# ఆశ్రమ పాఠశాలలలో ఉద్దీపకం -2: పరిశీలించిన ఏసిఎంఓ కే.రమేష్

**పాల్వంచ టౌన్ ఆగస్టు 19 నవభూమి ప్రతినిధి:** ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో చదువుకునే విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వ గిరిజన పాఠశాల వేముకుంటలో ఉద్దీపకం -2 వర్క్ పుస్తకములో ప్రాథమిక స్థాయి విద్యార్థుల నేర్పించే విద్యను బలోపేతం చేసేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల కమలాపురం మీ సెంటర్ పరిధిలోని పాఠశాలను ఏసీఎంవో ఐటీడీఏ భద్రాచలం కే. రమేష్ మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వేనుకుంట, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గుట్ట గూడెం పాఠశాలలో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులలో తెలుగు మాధ్యమం, ఆంగ్లం, గణితం విషయ సామర్థ్యాలను ఏసీఎంఓ కే. రమేష్ పరిశీలించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సామర్థ్యాలు, వారి నైపుణ్యాలు పెంపొందించడానికి ఉద్దీపకం -2 వర్క్ పుస్తకము గిరిజన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ఆయన అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ఉద్దీపకం పరీక్షలు నవంబర్ మాసంలో ఉంటుందని ఇప్పటివరకు నిర్దేశించిన పాఠ్యాంశాలను, వర్క్ పుస్తకములను విద్యార్థులతో ఉద్దీపకం -2 సాధన నిర్వహించాలని, విద్యార్థులలో విద్యా



ప్రమాణాలు, విద్యా నైపుణ్యాలు పెంపొందించే విధంగా ఆయన సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల కమలాపురం లో పాఠశాల భద్రాచలం ఏ సి ఎం ఓ కే.రమేష్ ప్రధానోపాధ్యాయులు చింతా బుచ్చి రాములు ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వారు సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ తరగతుల నిర్వహణల ను వారు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వ



ఉన్నత పాఠశాల కమలాపురం లో ఆరు ఏడు తరగతుల ఆంగ్లము, గణితము ఉద్దీపకం -2 తరగతుల నిర్వహణ ను వారు పరిశీలించారు. ఈ ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వేముకుంట. ప్రధానోపాధ్యాయులు బి. డాంగే, వి.రఘు, బి. నాగలక్ష్మి, ఈశ్వర్ రావు, భద్ర రావు, ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రామ్ కిషన్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, లక్ష్మీ బాయమ్మ, సూర్యనారాయణ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శంకరజ్యోతికి గణితంలో పిహెచ్‌డి పట్టా



**ఖమ్మం, నవభూమి ఆగస్టు 19:** ఖమ్మం జిల్లాలోని ట్రైబల్ గురుకులం డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న జి.శంకరజ్యోతి గారికి గణితశాస్త్రంలో డాక్టరేట్ పట్టా లభించింది. ఏ స్టడీ ఆన్ రెగ్యులర్ డామినేషన్ ఇన్ లైటక్ గ్రాఫ్స్ అనే అంశంపై చేసిన పరిశోధన పత్రానికి ఉస్మానియా యూనివర్సిటీ పిహెచ్.డి డిగ్రీని మంజూరు చేసింది. హన్మకొండ జిల్లా, దామెర మండలంలోని కోగిలివాయి గ్రామానికి చెందిన జి.సరోజన-అదిరెడ్డి దంపతుల మూడవ కుమారుడు గట్ల అనిల్‌రెడ్డి సతీమణి శంకరజ్యోతి, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో విద్యను అభ్యసించారు. గణితం కష్టంగా అనిపించే వారికి సులభంగా అర్థమయ్యే విధంగా బోధన చేయాలనే లక్ష్యంతోనే పిహెచ్.డి పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ 84వ కాన్వొకేషన్ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ వి.నారాయణ, యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకరజ్యోతికి డాక్టరేట్ పట్టాను ఇస్రో చైర్మన్ వి.నారాయణ, వైస్‌చాన్సలర్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. తన పరిశోధనలో సహకరించిన గైడ్ డాక్టర్ ఉపేందర్ రెడ్డి, గణిత విభాగం ప్రొఫెసర్స్‌కి, అలాగే తల్లిదండ్రులు పద్మావతి%-%సోమిరెడ్డి కుటుంబ సభ్యులకు శంకరజ్యోతి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి: సిఐటీయు ఆధ్వర్యంలో ధర్నా

**బూర్గంపాడు ఆగస్టు 19 నవభూమి:** ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని సీఐటియు మండల కన్వీనర్ పాండవుల రామనాథం అన్నారు. మంగళవారం బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి బంజరలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల సమస్యలపై ధర్నాని ర్వహించారు. అనంతరం పీహెచ్సీ వైద్యాధికారి ణి డాక్టర్ లక్ష్మీ సాహితికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ పాండవుల రామనాథం మాట్లాడుతూ ఈనెల 25న జరిగే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని ఆశాలకు ఆయన పిలుపునిచ్చారు. గత ప్రభుత్వాలు 2023 సె ప్టెంబర్ లో 15 రోజుల 15 రోజులు సమ్మె చేసిన అనంతరం గత ప్రభుత్వం రాష్ట్ర నాయకత్వాన్ని పిలిచి ఆశాల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోగా వారి ఆశలపై నీళ్లు చల్లారని ఆయన అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా వారికి సంబంధంలేని బాధ్యత లేని పనులను చేయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆశాలకు నెలకు 18 వేల పారితోషకం ఇవ్వాలని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి న్యాయమైన డిమాండ్స్ నెరవేర్చాలని, లేని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ తో భారీ ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. జులై నెల పెండింగ్ వేతనం ఆగస్టు నెల వేతనం కూడా ఆగస్టు నెల ఆఖరిలో ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ బుచ్చమ్మ, తారా దేవి, సుగుణ, తోకల రత్నకుమారి, బాయమ్మ, భారతి, నాగమణి, వెంకటరమణ, సీత, తిరుపతమ్మ. విజయ తదితరులు పాల్గొన్నారు.






# 24,25న బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

■ విలేకరుల సమావేశంలో బ్రహ్మకుమారి అరుణ

**ఖమ్మం, నవభూమి ఆగస్టు 18:** తలసేమియా బాధితులకు అండగా నిలిచేందుకు తమవంతు కర్తవ్యంగా ఈనెల 24, 25న ఖమ్మంలో బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు రాజయోగిని బ్రహ్మకుమారి అధిపతి ఖమ్మం ఇన్చార్జి బి. కె. అరుణ తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బ్రహ్మకుమారి అరుణ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించి ఆపదలో ఉన్న బాధితులకు వినియోగించేలా మానవ సేవయే మాధవ సేవగా భావించి, తమవంతు కర్తవ్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఖమ్మంలోని కస్పాబజార్ రామాలయం టెంపుల్, కెఎల్‌ఎమ్ షోరూం సమీపంలో ఉన్న బ్రహ్మకుమారి సంస్థ కార్యాలయంలో ఈనెల 24, 25న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సేకరించిన రక్తాన్ని తలసేమియా బాధితులకు, అదేవిధంగా ఆపదలో ఉన్న




పేషెంట్లకు ఉపయోగపడే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రక్తదానం చేసే దాతలకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లు అందించటం జరుగుతుందన్నారు. మానవత దృక్పథంతో చేసే ఈ సామాజిక కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బ్రహ్మకుమారి గీత, బ్రహ్మకుమారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థకు చేరిన సింగారం ప్రాథమిక పాఠశాల

■ విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం



**బూర్గంపాడు ఆగస్టు 19 నవభూమి:** బూర్గంపాడు మండల పరిధిలో కృష్ణ సాగర్ పంచాయతీకి చెందిన సింగారం గ్రామంలో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. చెరువు సింగారం ప్రాథమిక పాఠశాల గోడ కూలటం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని, పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకి గోడలు నాని ఒక సైడు గోడ కూలింది. స్లాబ్ కూడా శిథిలావస్థకు చేరింది. సిపిఎం పార్టీ బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్ల చెరువు సింగారం వెళ్లి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. చాలా ప్రమాదం తప్పిందని, గతంలో అధికారుల దృష్టికి అనేక సార్లు ఐటిడిఎ పీవో, ఐటిసి మేనేజ్మెంట్ కి, కలెక్టర్ కి గ్రామస్తులతో పాటు సిపిఎం పార్టీ కూడాఈ సమస్యని పరిష్కారం చేయాలని అన్నారు. కానీ పట్టించుకోకపోవడం వల్ల ఈరోజు రాత్రి గోడలు కూలటం జరిగింది. అదే స్కూల్లో పిల్లలు ఉంటే ఎంత ప్రమాదం జరుగునో, విద్యార్థి తల్లిదండ్రులు ఎంత ఆవేదనతో తల్లడిల్లిపోయే పరిస్థితి ఉండేది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఆ స్కూలు కు



కొత్తగా నిర్మాణం చేయాలని, చేయని యెడల పెద్ద ఎత్తున విద్యార్థుల తల్లిదండ్రుల తోటి ఆందోళన పోరాటం చేస్తామని అన్నారు.

ఆ గ్రామానికి వెళ్లాలంటే రోడ్డు సక్రమంగా లేదు, మట్టి రోడ్డు బురదమయం, టీచర్స్ సింగారం పోవాలంటే చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. అక్కడ అంగన్వాడి స్కూల్ కి టీచర్స్ పోలేని పరిస్థితి. చెరువు సింగారం గ్రామాన్ని ప్రభుత్వం అధికారులు పట్టించుకోవడం లేదు వెంటనే ఆ గ్రామంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని, ప్రాథమిక పాఠశాలలను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్ప సత్యనారాయణ, ఈసం సురేష్, సర్ప రాజు, సోయం వీరస్వామి, సున్ను లక్ష్మయ్య, సర్ప రాజురత్నం, మడకం ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

■ పట్టాలు ఇచ్చారు..స్థలం చూపించడం మరిచారు..స్థలాన్ని పరిశీలించిన (సిపిఐ-ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను సీపీఐ-ఎం మండల ప్రతినిధి బృందం



**తిరుమలాయపాలెం నవభూమి ఆగస్టు 19-** తిరుమలయపాలెం మండల కేంద్రంలో గత రెండు సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిపిఎం పోరాట ఫలితంగా 130 మందికి ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చారు కానీ ఇంతవరకు పొజిషన్ చూపించకపోవడం వల్ల పేదలందరూ కూడా అందులోకి పోలి పరిస్థితి ఏర్పడింది ఆ యొక్క విషయంపై అనేకసార్లు ప్రభుత్వ అధికారులు మంత్రికి విన్నవించుకుంటే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్డీవోలు ఎమ్మార్వో ని పేదలకు పొజిషన్ చూయించాలని ఆదేశించడం జరిగింది కానీ ఇంతవరకు ఆ యొక్క విషయంపై అధికారులు స్పందించకుండా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని



సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను విమర్శించారు ఆ యొక్క ఇంటి స్థలాలను సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలించారు స్వయానా రెవిన్యూ శాఖ మంత్రి చెప్పినప్పటికీ ఆర్డిఓ చెప్పినప్పటికీ ఇంటి స్థలాలకు పొజిషన్ చూయించకపోవడం అన్యాయమని ఇప్పటికైనా మండల తహశీల్దార్ స్పందించి ఒక ఇంటి స్థలాలను అర్హులైన నీరు  పేదలకు ఇవ్వాలని లేని ఎడల పేదలే ఆ యొక్క స్థలాన్ని ఆక్రమించుకుంటారని ఇప్పటికైనా మంత్రిగారు స్పందించి పేదలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఇంటి స్థలాల విషయంలో కొంతమంది పేదల వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయటం అన్యాయమని అరువులు లేని వారు ఉంటే తీసివేయొచ్చని దానికి గ్రామసభలోనా నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని కానీ పేదలకు అన్యాయం చేయటం దారుణమని వెంటనే స్పందించకపోతే మరో ఉద్యమం నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు యొక్క కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు నేరుసుల వెంకటేష్ కొమ్ము నాగేశ్వరరావు మద్దినేని శ్రీనివాస్ రావు దొండేటి నిర్మల్ రావు కొమ్ము బాబు సుందరయ్య సత్యనారాయణ రామనాథం పోలబోయిన ముత్తయ్య రామకృష్ణ స్వాతిముత్యం కొమ్ము వెంకన్న కొమ్ము ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకుల సిబ్బందికి వేతనాలు చెల్లించి, గురుకులాల పట్ల నిర్లక్ష్యం వీడాలి

## మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాకూబ్ పాషా



**పాల్వంచ ఆగష్టు 19 నవభూమి ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలోని మైనారిటీ గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల వేతనాలను వెంటనే విడుదల చెయ్యాలని మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ. యాకూబ్ పాషా మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గల మైనారిటీ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న వందలాది మంది ఔట్ సోర్సింగ్, టీచింగ్ – నాన్ టీచింగ్, నాన్ సాంక్షన్ ఉద్యోగులకు నేటి వరకు ప్రభుత్వం వేతనాలు చెల్లించని కారణంగా ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీ చాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలు సక్రమంగా చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడి ప్రతీ నెల మొదటి వారంలో క్రమం తప్పక వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# జిల్లా జడ్జిని సన్మానించిన అహ్మద్



**పాల్వంచ ఆగష్టు 19 నవభూమి ప్రతినిధి:** ప్రముఖ సామాజిక సేవా సంస్థ నేతాజీ యువజన సంఘం సేవా ప్రస్థానం 32 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.జె.కె.అహ్మద్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి పాటిల్ వసంత్ నేతాజీ యువజన సంఘం చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెందు రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు

# మదర్ థెరిస్సా సేవా సంస్థ సేవలు అద్భుతం



**రుద్రంపూర్ ఆగస్టు 19 నవభూమి:** ఒక నోరులేని మూగ జీవి (ఎద్దు ) సెప్టెక్ ట్యాంకులో పడి ఎటు మేసల లేక ఊపిరాడక నరకయాతన అనుభవిస్తుంది. శ్వాస తీసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్న తరుణంలో అక్కడున్నటువంటి కార్పొంటర్ మంద నాగేశ్వరావు, పాత్రికేయులు ఎండి షబ్బీర్ మాకు సమాచారం ఇవ్వడంతో మదర్ థెరిస్సా సేవా సంస్థ సభ్యులమైన మేము డి శ్రీనివాసు, సిహెచ్ రాములు వెంటనే స్పందించి కొంతమంది స్థానికుల సహాయంతో సెప్టిట్ ట్యాంక్ లో పడినటువంటి ఆ ఎద్దును అందరం కలిసి అతి కష్టం మీద పైకి లాగి దాని ప్రాణాలు కాపాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాకు సహకరించిన వారు మంద నాగేశ్వరరావు వారి కుమారులు ఇరువురు పెనగడప సుధాకర్, కాంట్రాక్టర్ పెనగడప శ్రీనివాస్, కాంట్రాక్టు కార్మికుడు వారికి మదర్ థెరిసా సేవా సంస్థ తరఫున ధన్యవాదములు. ఇలాంటి మంచి పని మా చేత చేయించిన భగవంతునికి ఎల్లవేళలా రుణపడి ఉంటాము ఇలాంటి సమాచారాలు ఎవరి కంటనైనా పడినట్లయితే దయచేసి మాకు సమాచారం ఇవ్వండి



# విఎస్ఎస్ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

**టేకులపల్లి ఆగస్టు 19 నవభూమి ప్రతినిధి:** జిల్లా కలెక్టర్, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు టేకులపల్లి మండలం బర్లగూడెం గ్రామపంచాయతీ జంగాలపల్లి గ్రామంలో అటవీశాఖ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కలిసి కన్వర్జెన్సీ గ్రామసభను మండల పరిషత్ అభివృద్ధి అధికారి బైరు మల్లేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ, హరితవనాలు ఏర్పాటు చేయడంలో భాగంగా వన సంరక్షణ సమితి సంఘాలను ఏర్పాటు చేయడం, మండలంలో 20 ప్లాంటేషన్ లలో వెదురు, టేకు మొక్కలతో కలిపి మొత్తం 44,000 మొక్కలను నాటించి వి ఎస్ ఎస్ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం లక్ష్యమని గ్రామస్తులకు వివరించారు. అటవీ భూములలో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎండి ముక్తార్ హుస్సేన్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేయాలని, ఐదు సంవత్సరాల తర్వాత వచ్చిన ఆదాయం వి ఎస్ ఎస్ సంఘానికి ప్రతిఫలాలు అందుతాయని తెలియజేశారు. గ్రామస్తులు ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్, కేవైసీ ఎన్ పి సి ఐ చేయించుకోవాలని తెలిపారు. ఎంపీడీవో గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బోడు




పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో రైతు గుజ్జుల అనంతలక్ష్మి పెంచుతున్న నిమ్మ తోటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎండి ముక్తార్ హుస్సేన్, అదనపు కార్యక్రమాధికారి కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, కార్యదర్శులు రమాదేవి, సన్యాసి, సతీష్, అటవిశాఖ సిబ్బంది హతిరం, రామ్మూర్తి, గాంధీ, గౌరీ, ప్రశాంత్, ఉపాధి హామీ సిబ్బంది భీముడు, ఈశ్వరి, సత్యనారాయణ, నరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు

# యురియా సరఫరాలో కేంద్రం విఫలం

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం
- రైతులకు సరిపడా యూరియా అందించకుంటే పోరాటం తప్పదు

**పాల్వంచ ఆగస్టు 19 నవభూమి ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తే ఇప్పటి వరకు 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయ్యిందని యురియా సరఫరా లో కేంద్రం ప్రభుత్వం విఫలం అయ్యిందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం విమర్శించారు. మంగళవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా ఈ రాష్ట్ర రైతులపై కేంద్ర ప్రభుత్వం సవితి తల్లి ప్రేమ చూపిస్తున్న ఏమి చేయలేకపోతున్నారని, మతం, కులం పేరుతో ప్రజలను రెచ్చగొట్టడం తప్ప కేంద్ర మంత్రులు, బీజేపీ రాష్ట్ర ఎంపీలు ఏమి సాధించలేరని, బండి సంజయ్, కిషన్ రెడ్డి కి దమ్ముంటే ముందు యూరియా కోసం ప్రధానిని నిలదీయాలని డిమాండ్ చేశారు. బిజెపి ఎంపిలు 8 మంది నోరుమూసుకొని ఉన్నారని దుయ్యబట్టారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటాను తక్షణమే పంపించే విధంగా ఢిల్లీ లో జంతర్ మంతర్ దగ్గర బిజెపి ప్రజా ప్రతినిధులు ధర్నా చేయాలని డిమాండ్ చేశారు.




రైతుల కోసమే తమ ప్రభుత్వం ఉందని గొప్పలు చెప్పుకునే మోడీ ప్రభుత్వం తాము పరిపాలిస్తున్న రాష్ట్రాలకు ఒక విధానం విపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలకు ఒక విధానం అవలంబిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు ప్రారంభమై వర్షాలు పడుతున్నందున కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర రైతులపై సవితి తల్లి ప్రేమ చూపించకుండా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన యూరియా వాటాను తక్షణమే పంపిణీ చేయాలని లేని పక్షంలో రైతులను సమీకరించి పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, రైతు సంఘం నాయకులు బీవీ సత్యనారాయణ, రాము, జకరయ్య, రామాచారి, శ్రీను, వెంకటేశ్వర్లు, కొంగర అప్పారావు, బానోత్ రంజిత్, సర్వయ్య, అల్లి వెంకటేశ్వర్లు, కృష్ణ, సత్యనారాయణ, పాషా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చంద్రమౌళీశ్వర ఆలయ ఛైర్మన్‌గా

# మగినం జయశ్రీ ప్రమాణ స్వీకారం

**ఎర్రుపాలెం,నవభూమి,ఆగస్టు19 :** మండల కేంద్రమైన ఎర్రుపాలెంలోని శ్రీ బాలత్రిపుర సుందరీ సహిత చంద్రమౌళ్వే శ్వర స్వామి వారి ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఆలయఈఓ రామకోటేశ్వరావు ఆధ్వర్యంలో చైర్మన్ గా ఎర్రుపాలెంగ్రామానికిచెందిన మగినం వీరభద్రరావు సతీమణి మగినం జయశ్రీ ప్రమాణస్వీకారంచేశారు.సభ్యులు గా కాజాజగన్నాధకృష్ణ, దూదిగంపకీరయ్య ,భవనంవెంకటప్పారెడ్డి,దేవరకొండ లక్ష్మణ్ రావులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా అర్చకులు నూరి గోపాలకృష్ణశర్మనునియమించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ తమ పై నమ్మకంతో ఆలయ పాలక వర్గానికి ఎంపిక చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు,మండల కాంగ్రెస్ పార్టీకి, నాయకులకు,గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.ఆలయాభివృద్ధి కోసం,ఆలయ ఆస్తుల పరిరక్షణ,భక్తుల సౌకర్యాల కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. జయశ్రీ–వీరభద్రరావుదంపతులను,పాలక వర్గ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర రెడ్డి,చావా రామకృష్ణ,శీలం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీనివాసరావు,షేక్ ఇస్మాయిల్, మల్లెలలక్ష్మణరావు, కంచర్ల వెంకట నరసయ్య, గుడేటి బాబురావు,దేవరకొండ శ్రీను, షేక్ జానీ భాష,మొగిలి



అప్పారావు,పంబి సాంబశివరావు,బుర్ర నారాయణ,చీదెళ్ళ శ్రీనివాసరావు,కొప్పు పరమేశ్వరరావు, అనుమోలు కృష్ణారావు,యరమల పూర్ణ చంద్రారెడ్డి,తల్లపురెడ్డి నాగిరెడ్డి,దేవరకొండ రాజీవ్ గాంధీ,శ్రీపాలశెట్టి తిరుపతిరావు, శీలం వెంకటరామిరెడ్డి,సూరంశెట్టి రాజేష్, సగ్గుర్తి కిషోర్,మగినం నాగేశ్వరరావు, దేవరకొండ రవి,ఏడుకొండలు,మెట్టు కృష్ణ, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో తిరుమలాయపాలెం మండల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**తిరుమలాయపాలెం నవభూమి ఆగస్టు 19-** నేడు అనగా బుధవారం ఉదయం 10.00గంటలకు ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో తిరుమలాయపాలెం మండల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ జరగనుందని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఇన్చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు .కావున తిరుమలాయ పాలెం మండల పరిధిలోని ఆయా ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారులబ్ధి దారులు ఆధార్ కార్డు జిరాక్స్ తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు

# 25న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి: సీఐటీయూ




**ఎర్రుపాలెం, నవభూమి, ఆగస్టు19:** ఆశాల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 25వ తారీఖున జరిగే ఖమ్మం కలెక్టరేట్ ముట్టడికార్యక్రమాన్ని జయప్రదం చేయా లని కెవిపిఎస్ మండల కార్యదర్శి సగ్గుర్తి సంజీవరావు పిలుపునిచ్చారు.సిఐటియు మండలకమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు తమసమస్యలను పరిష్కరించాలని 25వ తేదీ సోమవారం జరిగే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంగళవారం బనిగండ్లపాడు ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. సంజీవరావు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, పిఎఫ్ ఈసీఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సుధారాణి,ధన లక్ష్మి,రుక్మిణి, సంధ్యారాణి, నాగమణి, సునీత, రమణ, రమాదేవి, తదితర ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

# గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబుకు ఘన సన్మానం

**రుద్రంపూర్ ఆగస్టు 19 నవభూమి:** గ్రంధాలయ సంస్థ చైర్మన్ గా పసుపులేటి వీరబాబు కు ఘన ఘన సన్మానం చేశారు. కాలేజీ యజమాన్యం రమేష్, సైదయ్య, శ్రీకాంత్ మాట్లాడుతూ వీరబాబు రావడం నిజంగా చాలా సంతోషంగా ఉందని. వీరబాబు చాలా కష్టపడి పైకి వచ్చాడని అలాగే మా ఆశీస్సులు ఎప్పుడూ కూడా వీరబాబు కి ఉంటాయని, ఇంతటి అవకాశాన్నిచ్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి కి, మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి కి ధన్యవాదాలు తెలియజేశారు.



# ఆశా వర్కర్లకు పారితోషికం వద్దు.. కనీస వేతనం ఇవ్వాలి

## ■ పీహెచ్సీ ముందు సిఐటీయు ధర్నా డాక్టర్‌కి వినతి పత్రం సమర్పణ



**గుండాల ఆగస్టు 19 నవభూమి:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో తమకు పారితోషకం వద్దని ఫిక్స్ డ్ వేతనం ఇవ్వాలని కోరుతూ పిహెచ్సి ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం స్థానిక డాక్టర్ సుధీర్ కి సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. తమకు ప్రతి నెల వేతనం సక్రమంగా చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ 20 తారీకు గడుస్తున్నప్పటికీ వేతనం ఇవ్వలేదని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట దాటి వేసిందని అందుకనే ఈనెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు, 30 న



హైదరాబాద్ కమిషనరేట్ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించనున్నట్లు సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యురాలు వజ్జ సుశీల తెలిపారు. జబ్బ ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తమతో వెట్టి చాకిరీ చేయిస్తున్నదని కనీస వేతనం అమలు చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమం పూనేమ్ సరోజ, ఊకె విజయలక్ష్మి, లక్ష్మీనరసమ్మ కల్తీ వసంత, వినోద, ఈశ్వరి, ఈసం రమాదేవి తదితరులు పాల్గొన్నారు

# నిరుపేద విద్య కుసుమానికి సహాయం....!





**తిరుమలాయపాలెం నవభూమి ఆగస్టు 19-** తిరుమలయపాలెం మండలం రాజారం గ్రామానికి చెందిన నిరుపేద గొర్రెల కాపరి కూతురైన వీరబోయిన వెంకన్న కూతురు త్రివేణి ఇంటర్మీడియట్ "మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థ టేకులపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చదివి 1000 మార్కులకు గాను 982 మార్కులు సాధించి కాలేజ్ టాపర్ గా నిలిచింది. తనకు డాక్టర్ కావాలన్న కోరిక ఉన్న ఆర్థిక ఇబ్బందులు సరైన ప్రోత్సాహం లేక ఇంటి వద్ద ఉండగా. ఇట్టి విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ నాయకులు కొప్పుల ఉపేందర్ రెడ్డి రంగాపురం బాలకృష్ణ గౌడ్ బాణాల వెంకటరెడ్డి లు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు బాలికను సన్మానించి మంచిగా చదువుకునే వారు డబ్బు లేకుండా చదువు ఆగిపోవద్దని ఆమె డాక్టర్ కావాలనే కలను నిజం చేయాలని హైదరాబాద్ లోని ప్రముఖ కోచింగ్ సెంటర్ శ్రీ చైతన్య లో మాట్లాడి ఆమె నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ అయ్యే ఖర్చు సగం బరిస్తానని హామీ ఇచ్చారు. త్రివేణిని బాగా చదువుకొని డాక్టర్ సీటు సాధించాలని అలాగే పది మందికి సేవ చేయాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వీరబోయిన వెంకన్న కందాళ ఉపేందర్ రెడ్డి కి గ్రామ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# బాల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు

**ఆసిఫాబాద్-నవభూమి:** జిల్లాలోని మారుమూల గ్రామాల్లో వివిధ కారణా లతో బాల్యవివాహాలు జరుగుతున్నాయి. కేవలం అవగాహన లోపం, అనాలోచిత నిర్ణయాలతో పెళ్లిళ్లు చేస్తున్నట్టు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. హాయిగా తోటి విద్యార్థులతో చదువుకోవాల్సిన వయస్సులో మూడుముళ్ల బంధంతో భవితకు అడ్డుకట్ట వేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొచ్చినా జిల్లాలో ఎక్కడో ఓ చోట వెలుగు చూస్తునే ఉన్నాయి. తమ పిల్లలకు మంచి సంబంధం చూసి మూడుముళ్లు వేయించి తమ బాధ్యత తీర్చుకోవాలని తల్లిదండ్రులు భావిస్తుంటారు. ఇదే క్రమంలో తొందరపడి వివాహం చేస్తున్నారు. ఎక్కువగా అమ్మాయిల విషయంలోనే వివాహాలు జరుగడంతో భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు అధికంగా వస్తున్నాయని వైద్యు లు హెచ్చరిస్తున్నారు. వీటిని నియంత్రించాలని అధికారులు చెబుతున్నారు.

పుట్టబోయే బిడ్డకు- బాల్య వివాహాలు చేయడం వల్ల ఆరోగ్య పరం గా తల్లికి పుట్టబోయే బిడ్డకు ఎంతో నష్టమని వైద్య నిపుణులు ఒకవైపు చెబుతునే ఉన్నారు. మరో వైపు కొన్ని చోట్ల బాల్య వివాహాలనే కొన సాగిస్తున్న నేపథ్యంలో సమగ్ర శిశు సంరక్షణ శాఖ వీటికి అ డ్డుకట్ట వేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుం టోంది. సమాచారం మేరకు పెళ్లిళ్లను నిలిపివే స్తున్నారు. వ?ధూవరుల కుటుంబాలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఏళ్లుగా సభలు, సమావే శాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక అవగాహన సదస్సుల్లో స్వచ్ఛంద సంస్థలు బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని చెబుతున్నా జరిగే అనర్థాలు మాత్రం అగడంలేదు. అడపిల్లే కదా తొం దరగా పెళ్లి చేస్తే ఓ పనై పోతుందని కొందరు ఆలోచిస్తూ పెళ్లిళ్లు జరిపిస్తున్నారు. ప్రస్తుతం శ్రావ ణమాసం కావడంతో జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో బాల్యవివాహాలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్న ట్లు అధికారులకు సమాచారం రావడంతో వాటిని అడ్డుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సంక్షే మశాఖ పరిధిలోని ఉన్నతాధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ



ఉ ద్యోగులు గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగకుండా దృష్టి సారిస్తున్నారుజ

మూడేళ్లుగా- జిల్లాలో మూడేళ్లుగా ఆయా మండలాల్లో అవగా హన సదస్సులు నిర్వహించడంతో పాటు బాల్య వివాహాలను అడ్డుకున్న సంఘటనలు చోటు చేసు కున్నాయి. జిల్లాలో 2023లో 18, 2024లో 15, 202 5లో ఇప్పటి వరకు 13 బాల్య వివాహలను అధికా రులు అడ్డుకున్నారు. మూడేళ్ల కాలంలో జిల్లా వ్యాప్తంగా 300లకు పైగా అవగాహన సదస్సులు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల తలెత్తే అనా ర్థాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కాగా బాల్య వివాహాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం గతేడాది ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. టోల్ ఫ్రీ నంబర్లు 1098, 181, 100లతో పాటు సమీప ప్రాంతంలో పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేయ వ చ్చు. సమాచారం అందిన వెంటనే అదికారులు అక్కడికి చేరుకొని బాల్య వివాహాలను అడ్డుకుని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు.

**ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం:**

**బూర్ల మహేష్, డీసీపీవో, ఆసిఫాబాద్**

జిల్లాలో బాల్యవివాహాలను అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. బాల్య వివాహల మూలంగా ఏర్పడే అనర్థాలతో పాటు కేసులు వివ రాలతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. బాల్య వివాహాల సమాచారం అందించే వారి వివ రాలు గోప్యంగా ఉంచు తాం. బాల్య వివాహాలు కొనసాగకుండా సహకారం అందించాలి.

# తల్లాడ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ డే సందర్భంగా ఫోటోగ్రాఫర్స్‌కు ఘన సన్మానం




**తల్లాడ, నవభూమి, ఆగష్టు 19:** తల్లాడ లైన్స్ క్లబ్ అధ్యక్షులు కోడూరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 126వ అంతర్జాతీయ ఫోటోగ్రఫీ డే సందర్భంగా తల్లాడ మండలంలో గల ఫోటోగ్రాఫర్స్ కు ఘనంగా సన్మానం చేయడం జరిగింది ఈ సందర్భంగా అధ్యక్షులు మరియు డిస్టిక్ జాయింట్ సెక్రెటరీ దారా శ్రీనివాసరావు, జెడ్ సి బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో గల ఫోటోగ్రాఫర్స్ అందరికీ 186వ అంతర్జాతీయ ఫోటోగ్రఫీ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్స్ అధ్యక్షులు గుమ్మా రామకృష్ణ, మరియు ఓంకార్, గురిజాల నారాయణరావు, ఎస్ కే ఆసిఫ్, గుమ్మా నరేష్, శీలం కరుణాకర్ రెడ్డి, కాసర్ల నరేష్, ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ కు శాలువాలతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసి దగ్గుల రాజశేఖర్ రెడ్డి, ఏమి రెడ్డి వెంకట్ నారాయణ రెడ్డి, లైన్స్ క్లబ్ సభ్యులు శీలం వెంకటరెడ్డి, కటికి వెంకటేశ్వరరావు, యాచవరపు వెంకటరెడ్డి, నున్న తిరుమలరావు, తోట మురళి, వేమిరెడ్డి చిన్న కృష్ణారెడ్డి, మొదలు లైన్స్ క్లబ్ మిత్రులు పాల్గొని ఫోటోగ్రాఫర్స్ కు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు

# ఆకతాయిల నుండి బెదిరింపులు వస్తే షీ టీం సభ్యులకు సమాచారం అందించాలి




**ఏనుకూరు, నవభూమి, ఆగష్టు 19:** ఆకతాయిల నుండి బెదిరింపు కాల్స్ వస్తే వెంటనే షీ టీం సభ్యులకి సమాచారం అందించాలని ఖమ్మం షీ టీం సభ్యుల బృందం తెలిపారు. మండల పరిధిలోని రాఘవపురం ఉన్నత పాఠశాలలో ఖమ్మం పోలీస్ స్టేషన్ నుండి షీ టీం సభ్యులు పాఠశాల విద్యార్థులకు మంగళవారం బ్యాడ్ టచ్ గుడ్ టచ్ అనే కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాట్సాప్ లో డిపి ఫోటోలు పెట్టుకోవద్దని,ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ ల వివరాల గోప్యత పాటించాలని , వాట్స్అప్ కాల్స్ మెసేజ్లకు స్పందించవద్దని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్న 8712659222 నెంబర్ కి కాల్ చేసి వివరాలు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శోభ, రుక్మిణి, కిరణ్, రాజు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాగి సుజాత,పొట్ట రామారావు, పుల్లయ్య, శ్రీనివాసరావు,నాగేశ్వరరావు,విజయశ్రీ, భావ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల నిర్వాహకులు నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి




**ఎర్రుపాలెం, నవభూమి, ఆగస్టు19:** వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో గణేష్ మండపాలను ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని ఎస్సై రమేష్ బాబు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై రమేష్ బాబు మాట్లాడుతూ వైరా ఏసిపి రెహమాన్ ఆదేశాల ప్రకారం మండపాల ఏర్పాటు కొరకు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు.వైరా డివిజన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వహణ ఉత్సవ కమిటీ సభ్యులు,తెలంగాణ పోలీసుశాఖ వారు రూపొందించిన పోర్టల్ లో ధరఖాస్తు చేసుకోవాలని,ఆన్లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపాల నిర్వహణ,మండపానికి సంబంధించిన సమాచారం కొరకు మాత్రమేనని,ఈ సమాచారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత,పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులభంగా ఉంటుందని ఎస్సై తెలిపారు.పోలీసుశాఖ అనుమతి మంజూరు తరువాతనే వినాయక మండ పాలనుఏర్పాటుచేసుకోవాలని సూచించా రు.మండపాల పూర్తి బాధ్యత మండపాల నిర్వహకులదే అని,ప్రతీ మండపం వద్ద తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని,ముందుగా తెలిపిన సమయా నికి నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. మండపాలుప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని,మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం యజమాని, సంబంధిత శాఖల వారి అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాల కమిటీ వివరాలు,బాధ్యతవహించేవారి వివరాలు ,ఫోన్ నెంబర్లను మండపంలో ఏర్పాటు చేయాలని,రాత్రి10 గంటలవరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలని, మండపాల్లో, శోభాయాత్రల్లోఎట్టి పరిస్థితుల్లోనూ డీజే లనుఏర్పాటు చేయరాదన్నారు. మండపం వద్ద 24 గంటలు ఒక వాలంటీర్ ఉండే విధంగాచర్యలు తీసుకోవాలని, మండపాల వద్ద మద్యం సేవించడం ,పేకాట ఆడటం, అసభ్యకరమైన నృత్యాలు, అన్యమతస్తు లను కించపరిచే విధంగా ప్రసంగాలు, పాట లు పూర్తి నిషేధంఅనితెలిపారు.మండపం వద్ద పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసు కోవాలి,విధిగా పోలీసు అధికారుల తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారని తెలిపారు.ఎటువంటి సంఘటనలు జరిగినా నిర్వాహకులదే పూర్తి బాధ్యత అని ఎస్సై రమేష్ బాబు తెలిపారు.

# వేలం పాటల ద్వారా భారీగా పెరిగిన స్వామివారి ఆదాయం

**ఎర్రుపాలెం, నవభూమి, ఆగస్టు 19:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన స్వయంభు జమలాపురం వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వివిధ రకాల దుకాణములు,వ్యాపారములు నిర్వ హించుకొనుటకు దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ ఎం వీరస్వామి పర్య వేక్షణలో మంగళవారం నిర్వహించిన వేలం పాటల ద్వారా ఆలయ ఆదాయం భారీగా పెరిగింది.స్వామివారికి భక్తులు సమర్పించే తలనీలాల వేలంపాట 20 లక్షలు,కొబ్బరికాయలు పూజా సామాగ్రి అమ్ముకునే పాటకి 30 లక్షల,26 వేలు, బొమ్మలు ఫ్యాన్సీ దుకాణానికి 9 లక్షల 40వేల రూపాయలు,కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకునే హక్కు పాటకు 4 లక్షల 12 వేలు,పొంగళ్ళు చేసుకొనుటకు గ్యాస్ స్టవ్ లు సప్లై చేయుటకు12 లక్షల27 వేల రూపాయలు,భక్తులు స్వామి వారికి సమర్పించే పాలు,బెల్లం,బియ్యం,ధాన్యం పాటకి 7 లక్షల 67 వేల రూపాయలు, వాహనపార్కింగ్ పాటకు8లక్షల 67 వేలు, సెల్ ఫోన్స్,లగేజీ కౌంటర్ పాటకు 2 లక్షల 45 వేల రూపాయలు,కూల్ డ్రింక్స్,పాన్ షాప్ 3 లక్షల 25 వేలు,ఆలయం వెనుక భాగంలో ఫ్యాన్సీ,కొబ్బరికాయలు దుకా ణానికి 70 వేల రూపాయలు వేలంపాటల ద్వారా స్వామివారికి ఆదాయం వచ్చింది. గత సంవత్సరం పాటల ద్వారా మొత్తం 76 లక్షల 85 వేల రూపాయలు రాగా,ఈ



సంవత్సరం 98 లక్షల79 వేలు ఆదాయం వచ్చింది.గత సంవత్సరం కన్న ఈ సంవత్సరం 21లక్షల 94 వేలరూపాయల ఆదాయం పెరిగినట్లు ఈవో కొత్తూరు జగన్మోహన్రావు తెలిపారు. ఇంకా ఆలయం ప్రాంతంలో భోజన, కాఫీహెూటల్స్ పాటనిర్వహించాల్సి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండ్రీ ట్రస్ట్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపర్నెంట్ కే విజయ కుమారి,ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సిబ్బంది, పాటదారులు పాల్గొన్నారు.

# తిమ్మరావుపేట కేంద్రంగా యూరియా సరఫరా చేయాలి

■ తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్

**ఏన్కూరు, నవభూమి,ఆగష్టు 19:** ఏన్కూరు మండలం తిమ్మరావుపేట కేంద్రం గా యూరియా సరఫరా చేయాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం తిమ్మరావుపేట గ్రామం లో కలసాని సాయి అధ్యక్షతన జరిగిన రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏన్కూరు మండలం మొత్తం ఒకే సోసైటీ ఉండటం మూలంగా యూరియా కొరత తీవ్రంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు మండల కేంద్రానికి సుమారుఇరవై కిలోమీటర్ల దూరం తిమ్మారావుపేట నుండి తెల్లవారుజామున వచ్చియూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మండలం లో మరో యూరియా సరఫరా కేంద్ర ఏర్పాటు చేయాలి అని కోరారు. తెలంగాణ రాష్ట్రం లో రామగుండం లో ఉన్న యూరియా ఉత్పత్తి



పరిశ్రమ లో సెట్ డౌన్ చేయడం వల్ల రాష్ట్ర వాటా రావడం లేదు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం కు కేటాయించిన యూరియా సకాలంలో అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం గ్రామ అధ్యక్షులు కట్రాల బిక్షం, కార్యదర్శి సంజీవరావు, కాకాని కోటేశ్వరరావు, రవి, సిలార్, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ నాకు అపాయింట్‌మెంట్ ఇస్తారో లేదో: సీఎం రేవంత్‌రెడ్డి హాట్ కామెంట్స్



**హైదరాబాద్, నవభూమి, ఆగష్టు 19:** : బీసీ రిజర్వేషన్ బిల్లుపై సుప్రీంకోర్టు తీర్పుకోసం ఎదురు చూస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బిల్లులు రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. ఇవాళ(మంగళవారం) గాంధీభవన్‌లో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 90రోజుల్లో రాష్ట్రపతి బీసీ రిజర్వేషన్ బిల్లు పూర్తిచేయాలని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఇంకా ఆలస్యమైతే పార్టీ పరంగా ఇద్దామని అందరినీ కోరి ఎన్నికలకు వెళ్లడమే తమ ముందున్న ప్రత్యామ్నాయమని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈ నెల 23వ తేదీన జరిగే పీఏసీలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతికి మద్దతు కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలుస్తారా అని మీడియా ప్రతినిధులు రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. అధిష్టానం ఏం ఆదేశిస్తే అదే చేస్తానని తెలిపారు. కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇస్తారో లేదో.. ఆయనకు తన మొఖం చూడటం ఇష్టం ఉందో లేదోనని సరదాగా వ్యాఖ్యానించారు సీఎం రేవంత్‌రెడ్డి. కేసీఆర్ ఆస్పత్రిలో ఉంటే తానే వెళ్లి పరామర్శించానని గుర్తుచేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమి ఎంపిక చేసిందని చెప్పుకొచ్చారు. తన నిర్ణయం ఏం లేదని.. ఇండియా కూటమి నిర్ణయమని స్పష్టం చేశారు. తాను రెగ్యులర్‌గా ఆయనను కలుస్తానని తెలిపారు. తాను జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్‌కు వెళ్తానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య



**ఏనుకూరు, నవభూమి, ఆగస్టు 19:** ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన ఏనుకూరులో మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏనుకూరుకు చెందిన నూనవత్ ప్రేమ్ కుమార్ (35) అనే యువకుడు తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రేమ కుమార్ గత కొంతకాలంగా జూలూరుపాడు మండలంలో హెచ్ పి గ్యాస్ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటికి వచ్చి ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ప్రేమ్ కుమార్ కి భార్య గీత, కుమార్తె కుమారుడు ఉన్నారు. ఆత్మహత్యకి కారణం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

# డెడ్‌లైన్ సెప్టెంబరు 15

### శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో నాలుగో యూనిట్ రన్ చేయడానికి ఏర్పాట్లు

### పూర్తి కావొస్తున్న స్టార్టర్ వైండింగ్, 27న రోటర్ దించనున్న అధికారులు

### అన్నీ అనుకున్నట్లు జరిగాక మరోసారి హై ఓల్టేజీ టెస్టు, తర్వాత ఉత్పత్తి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 19 నవభూమి ప్రతినిధి:** ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునే ఒత్తిడిలో బ్యాటరీలను మారుస్తుండగా శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో మంటలు చెలరేగి తొమ్మిది మంది సజీవ దహనమైన దుర్ఘటనకు నేటికి ఐదేళ్లు పూర్తవుతోంది. 2020 ఆగస్టు 20వ తేదీన ఈ దుర్ఘటన జరగ్గా జెన్‌కో ఉద్యోగులు ఏడుగురు, ప్రైవేటు కంపెనీకి చెందిన ఉద్యోగులు ఇద్దరు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో నాలుగో యూనిట్ పూర్తిగా కాలిపోగా సుమారు రూ. 100 కోట్ల మేర ఆస్తినష్టం జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఐదేళ్లుగా నాలుగో యూనిట్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జెన్‌కో కష్టపడుతున్నప్పటికీ ఇంకా పనులు పూర్తికాలేదు. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి సీజన్ కొనసాగుతుండగా సెప్టెంబరు 15 వరకు పనులు పూర్తిచేసి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నారు. ఇప్పటికే స్టేటర్ వైండింగ్ పనులు పూర్తి కావొస్తుండగా బార్ గ్రేసింగ్, ఎండ్ క్యాప్స్ ఫిల్లింగ్ పనులు ముమ్మరంగా నడుస్తున్నాయి. ఆగస్టు 27వ తేదీన స్టేటర్ పనులు పూర్తిచేసి రోటర్‌ను దించడానికి నిర్ణయించారు. ఆ తర్వాత అప్పర్ బ్రాకెట్స్, ప్లేట్స్ బిగించి మరోసారి హెచ్‌వీ (హై ఓల్టేజీ) టెస్టును పూర్తిచేయనున్నారు. ఆ తర్వాత విద్యుదుత్పత్తికి మార్గం క్లియర్ అవుతుందని అంచనాలు వేస్తున్నారు. జూలై 14వ తేదీ నాటికే నాలుగో యూనిట్‌లో మరమ్మతులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని భావించినప్పటకీ సాధ్యంకాలేదు. ఇప్పుడు తాజా గడువులోపు పనులు పూర్తవుతాయా అనేది తెలియాల్సి ఉంది. జెన్‌కో, కాంట్రాక్టు సంస్థ అయిన వాయిత్ ఏజెన్సీలకు చెందిన 25 మంది ఉద్యోగులు నిరంతరం పనులు చేస్తున్నారు. ఈ యూనిట్ ప్రారంభమైతే మరో 150 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అదనంగా జరగనుంది. శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రం పూర్తి అండర్‌గ్రౌండ్‌లో ఉంటుంది. జపాన్ సాంకేతికతతో నిర్మించిన ఈ హైడల్ పవర్ ప్రాజెక్టులో ఆరు యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌లో 150 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. ఇందులో ఉత్పత్తి ప్రారంభించిన 20 సంవత్సరాలపాటు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తలేదు. 2020 ఆగస్టు 20వ తేదీన విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునే క్రమంలో బ్యాటరీలపై ఒత్తిడి ఎక్కువైంది. ఈ క్రమంలో నాలుగో యూనిట్‌లో బ్యాటరీలు మారుస్తుండగా షార్ట్ సర్క్యూట్ అయ్యింది. ఉవ్వెత్తున ఎగిసి పడిన మంటల్లో నాలుగో యూనిట్ పూర్తిగా కాలిపోగా ఐదుగురు ఇంజనీర్లు, ఇద్దరు ప్లాంట్ అసిస్టెంట్లు, ఇద్దరు అమర్‌రాజా బ్యాటరీ కంపెనీ ఉద్యోగులు సజీవ దహనమయ్యారు. ప్లాంటును రక్షించాలని కష్టపడుతుండగా మంటలకు ఆహుతయ్యారు. ఈ దుర్ఘటనకు ఇద్దరు సీఈలను బాధ్యులుగా చేసి, వారి నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని విచారణలో గుర్తించిన తర్వాత వారిని ఎస్‌ఈ లుగా డిమోట్ చేశారు. అయితే తర్వాత వారు మళ్లీ అడ్డదారుల్లో ప్రమోషన్ల కోసం ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. 9 మంది మృతికి కారణమైన వారిని నామమాత్రపు చర్యలతో వదిలేశారనే విమర్శలు కూడా వచ్చాయి.

# 186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం వేడుక

**తల్లాడ నవభూమి,ఆగస్టు 19:** మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ప్రత్యూష, చేతులమీదుగా రోగులకు పండ్లు బ్రెడ్ ఫోటోగ్రఫీ డే సందర్భంగా తల్లాడ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ ప్రెసిడెంట్ గుమ్మా రామకృష్ణ, ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్లు అందరూ కలిసి ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ప్రపంచ ఫోటోగ్రాఫర్ పితామహుడు లూయిస్ మండే డాగురె చిత్రపటానికి పూలమాలవేసి కేక్ కట్ చేసి,ఫోటోగ్రాఫర్లు అనందాన్ని పంచుకున్నారు.











# గుట్టుమల్లారం రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమం

■ హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబూరావు



**మణుగూరు ఆగస్టు 19 నవభూమి ప్రతినిధి:** "రైతునేస్తం కార్యక్రమం ద్వారా ప్రతి మంగళవారం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా రైతులతో మాట్లాడి పంటలపై సూచనలు, సలహాలు ఇస్తారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తప్పక హాజరుకావాలని ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి, వి బాబూరావు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ



అధికారి రాహుల్ రెడ్డి, ఏఓ ఛటర్జీ, సాయి కృష్ణ, మణుగూరు మండల ఏఈఓ లు కొమరం లక్ష్మణరావు, హారిక తో పాటు రైతులు పాల్గొన్నారు. తిర్లాపురం గ్రామ పంచాయతీ లో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ఏ డి ఏ బి. తాతారావు కలిసి వరి, పత్తి, కూరగాయ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా తెగుళ్ల నివారణపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కె వి కె ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భరత్, హెచ్ ఓ శివ, హరిశ్చంద్ర, మణుగూరు వ్యవసాయ అధికారి రాహుల్, ఏ ఈ ఓ హారిక మరియు రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు

**వికారాబాద్-నవభూమి,ఆగస్టు 19:** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులను సైతం మోసం చేస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాబోయే ఏ ఎన్నికలు అయినా బీజేపీ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఇవాళ(మంగళవారం) వికారాబాద్ జిల్లాలో పర్యటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత మొదటి సారి వికారాబాద్ జిల్లాకు రాంచందర్ రావు వచ్చారు.

జిల్లా పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రాంచందర్ రావుకు ఘనస్వాగతం పలికారు. ఆయనను గజమాలతో సన్మానించారు బీజేపీ శ్రేణులు. తేజ ఫంక్షన్ హాల్లో కార్యకర్తల సమావేశంలో పాల్గొని రాంచందర్ రావు ప్రసంగించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని రాంచందర్ రావు ధ్వజమెత్తారు. ప్రత్యామ్నాయంగా తెలంగాణలోని ప్రజలు నమ్మకంతో బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు రాంచందర్ రావు.

రైతు బంధు నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షలాది మంది రైతులకు ఏ ఒక్కసారి ఆపకుండా పీఎం కిసాన్ యోజన నిధులు జమ



చేస్తున్నారని స్పష్టం చేశారు. రిటైర్‌మెంట్ డబ్బులు కూడా ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, ఉద్యోగులు నేడు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ పాలన వైపు చూస్తున్నారని వెల్లడించారు. కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని రాంచందర్ రావు దిశానిర్దేశం చేశారు.